మినీకథ

నిజం



జి. పద్మినీ ప్రసాద్

ఎవరో వీధి తలుపు తట్టేరు. 'వస్తున్నా' అంటూ వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా వయసు మళ్ళిన వృద్ధుడు నిలుచున్నాడు.

ఒక్క క్షణం విచిత్రంగా ఆ వ్యక్తిని చూశాను.

"ఎవరు కావాలండీ?" అని ప్రశ్నించాను.

ఆయన తటపటాయించాడు. నా వైపు చూస్తూనే సంశయంగా ప్రశ్నించాడు.

"రఘురాం వుండేది ఇక్కడేనా బాబూ" అంటూ.

పరిస్థితిని కొంత గ్రహించగలిగాను.

"అవునండీ, అతనితో ఏమైనా పనుందా?" అడిగాను.

"మాట్లాడవలసి వుంది. ఒకసారి పిలుస్తావా?" అన్నాడు.

"లేదండీ. ఊళ్ళో లేదు. ఏమైనా ముఖ్య విషయమైతే నాతో చెప్పండి. రాగానే చెబుతాను" అన్నాను.

ఆయన ముఖంలో నిరాశ తాండవించింది.

"ఊళ్ళో లేడా! ఎప్పుడొస్తాడో తెలుసునా?"

"చెప్పలేనండీ. వాళ్ళ ఊరు రమ్మని ఉత్తరం వచ్చింది. వెంటనే బయల్దేరి వెళ్ళిపోయాడు. బహుశా ఒక వారం రోజులు వుంటాడనుకొంటాను" అన్నాను.

"అయ్యో, ఇప్పుడెలా?" అనుకొన్నాడు.

"ఇంతకీ మీరెవరండీ! ఎందుకొచ్చారో చెప్పలేదు" అన్నాను.

ఆయన నన్ను పరిశీలనగా చూశాడు.

"నువ్వు రఘురామ్ స్నేహితుడివా బాబూ" అన్నాడు.

"కాదండీ. దూరపు చుట్టాన్ని. వరసకు తమ్ముడ్నవుతాను. ఈ ఊరు ఎప్పుడూ రాలేదు. అన్నయ్య రమ్మని అంటుండేవాడు. ఇప్పుడు వీలు కుదిరింది. వచ్చాను" అన్నాను.

"అలాగా బాబూ, నా పేరు రామయ్య. మా అమ్మాయి సుధ, రఘురాం మంచి స్నేహితులు" అంటూ ఆగిపోయాడు.

"సుధా! ఆ పేరు అన్నయ్య చెప్పగా విన్నాను" అన్నాను.

ఆయన ముఖంలో ఒక సంతోష రేఖ కన్పించింది.

"వీకూ చెప్పాడా! అంతేలే. ఆత్మీయులకు కాకపోతే మరెవ్వరికి చెప్పకొంటాడు. సుధను ఇష్టపడినట్లు, పెళ్ళి చేసుకోబోతున్నట్టు కూడా చెప్పాడా?" అడిగాడు.

నేను మౌనం వహించాను.

"బాబూ, సుధ నాకు ఒక్కగానొక్క కూతురు. నా ప్రాణంతో సమానం. నా పేదరికం ఆమె నీడను కూడా పడకుండా పెంచుకొచ్చాను. ఉన్నంతలో లోటు చెయ్యలేదు. చదివించాను. కాని, ఆ చదువే దాని జీవితానికి పరీక్ష తెచ్చిపెట్టింది."

"ఏమైంది, ఏం జరిగింది?" ఆతృతగా అడిగాను.

"ఏం చెప్పను బాబూ, వయసులో వున్న పిల్ల. కాలేజీ చదువులు వెలగబెడుతూ ప్రేమలో పడింది. రఘురాం తనను పెళ్ళి చేసుకొంటాడని, అతన్ని ప్రేమిస్తున్నానని నాతో చెప్పింది. నాకు ఇటువంటి వ్యవహారాలు నచ్చవు. ఈ ప్రేమల మీద నమ్మకమూ లేదు."

"ఎందువల్ల నంటారు?" అడిగాను.

"వయసు వేడిలో బాధ్యతలు మరచి కల్పించుకునే అందమైన కలలు బాబూ ఇవన్నీ. జీవితంలో ఎన్నడూ కూడా తాత్కాలిక ఆవేశాలకు లోను కాకూడదు. ఇదీ నా అభిప్రాయం" అంటూ ఆగాడు.

"బాగా చెప్పారు. నాకూ ఈ ప్రేమ వ్యవహారాలు నచ్చవు. అదే రఘురాంతో చాలా సార్లు అంటుండేవాడ్ని" అన్నాను.

"రఘురాం ఎటువంటివాడు బాబూ!"

"మంచివాడే. కాని, బలహీనతలున్నవాడు."

"ఇతరుల జీవితాలతో ఆడుకోని వ్యక్తి ఐతే చాలు. ఈ రోజుల్లో అనేక బలహీనతలు మనుషులను పట్టి ఆడిస్తున్నాయి. మనం కాదన్నా కూడా ఆ ప్రలోభానికి దాసులవుతున్నది యువతరం."

"అబ్బే, మా రఘురాంకి ఎటువంటి చెడు అలవాట్లు లేవండి. కాఫీ, టీలు లాటివి త్రాగడు. సిగరెట్, మద్యం అనే దురలవాట్లు లేవు."

"మంచిది బాబూ, రఘురాం గురించి అమ్మాయి చెప్పింది.ఎంతో మంచివాడు, సహృదయుడు అని. కాని అతని అభిప్రాయం ఏమిటో కూడా తెలియాలిగా."

"మీరు అడిగారు కనుక చెబుతున్నాను. రఘురాం నిజంగా మంచివాడు. ఎంత మంచివాడో చెప్పమంటారా, ఏ ఆడపిల్ల కనిపించినా ప్రేమిస్తున్నానని వెంటబడతాడు. రఘురాం మాటల్లో రాణి, స్వప్న, దేవి, శాంతి, ఇంకా ఎన్నో పేర్లు చెప్పాడు. వాటిలో సుధ పేరు కూడా వుంది. వీరందరి మీద కూడా రఘురాంకి చాలా ప్రేమ."

"బాబూ, నువ్వేవరి...?" ఆశ్చర్యంగా, ఆందోళనతో అడిగాడు.

"అవునండీ. రఘురాం మంచివాడే. కాని, స్త్రీ బలహీనత వుంది. ఆడపిల్లల్ని ప్రేమ పేరు చెప్పి మోసం చేస్తాడు. ఇంకా చెప్పాలంటే అది మోసం కాదంటాడు. వాళ్ళందర్నీ కూడా నిజంగా ప్రేమిస్తున్నానంటాడు. ఇదీ అతని మనస్తత్వం."

ముసలాయన క్షణం నిగ్రహించుకున్నాడు.

"నువ్వు పొరపాటు పడివుండవచ్చు బాబూ రఘురాం మా అమ్మాయిని పెళ్ళిచేసుకుంటానని మాట ఇచ్చాడు. సుధ నమ్మకంగా చెప్పింది."

"కావచ్చును. కాని, మీరు మరొక సత్యం కూడా గ్రహించాలి. రఘురాం... అదే మా అన్నయ్యకు పెళ్ళి జరిగింది. అంతే కాదు. ఇద్దరు పిల్లలు కూడా. ప్రస్తుతం వారి కోసమే ఊరు వెళ్ళాడు."

ఆయన నిశ్చేష్టుడయ్యాడు. కళ్ళల్లో నీరు.

"బాబూ, నువ్వు... నువ్వు చెప్పేది నిజమేనా?"

నేను మాట్లాడలేకపోయాను. కాని తప్పదు.

"మీ ముఖం చూస్తూ అబద్ధం చెప్పలేను" అన్నాను.

"మంచిది బాబూ! వస్తా."

భారంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోతున్న ఆ వ్యక్తిని చూస్తే నాకు గుండె తరుక్కుపోయింది. ఆడపిల్లను కన్న తండ్రి! ఈ శిక్ష తప్పదు.

కాని, ఆ ముసలాయనకు తెలియని నిజాలు కొన్ని వున్నాయి. ఆయన ఎవరికోసమైతే వచ్చాడో, ఆ రఘురాం నేనేనని, పెద్ద కట్నంతో నిశ్చయమైన సంబంధం చేసుకోవడం కోసం, ప్రేమించిన పేదపిల్లకు అన్యాయం చేస్తున్నాననే విషయం రహస్యంగానే వుండిపోయింది. ●